
తిమ్మాపూర్: రేణికుంటలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


జమ్మికుంట: శ్రీసత్యనారాయణస్వామివ్రతంలో దంపతులు, భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి

సాక్షి నెట్‌వర్క్: హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం కార్తీకపౌర్ణమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఆలయాలకు తరలివచ్చిన మహిళలు, భక్తులు దీపాలు వెలిగించి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పండుగను పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణవ్రతాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. కార్తీక మాసంలో వెలిగించిన దీపకాంతులు ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మంలో హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగలో కార్తీక పౌర్ణమి ఒకటని, పరమశివుడితోపాటు శ్రీమహావిష్ణువుకు అత్యంత ఇష్టమైన పర్వదినమని పేర్కొన్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంటలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం చేపట్టారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల దైవనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. అక్కడక్కడ కోటి దీపోత్సవం, భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం కుటుంబ సభ్యులందరూ టపాసులు కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.


పూజలు చేస్తున్న హుజూరాబాద్ చైర్‌పర్సన్ రాధిక శ్రీనివాస్ దంపతులు


శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో సామూహిక వ్రతం


హుజూరాబాద్ శివాలయంలో భక్తుల రద్దీ


వీణవంక శివాలయంలో భక్తుల పూజలు


గన్నేరువరం: ఖాసీంపేట మానసాదేవి ఆలయంలో తులసీ కల్యాణం


మానకొండూర్: సత్యనారాయణ వ్రతంలో దంపతులు, భక్తులు


చొప్పదండి: సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు


మానకొండూర్: మండలంలోని అన్నారం-లలితాపూర్ గ్రామాల మధ్య కల్వర్టు ప్రాంతంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ సెల్ నంబర్ 9440818867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కొనుగోలు కేంద్రం పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

జమ్మికుంట: పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ధాన్యం అమ్మకానికి తీసుకువచ్చిన రైతులతో అమ్మకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ వరంగంటి రవి తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో కోటి దీపోత్సవం

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శివాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. మహిళలు భారీ ఎత్తున ఆలయానికి చేరుకొని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు భక్తులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

సభ్యత్వ నమోదు ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఐత హరీశ్ మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యకుడు వర్లపల్లి రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త వందరూపాయలతో సభ్యత్వం తీసుకుంటే పార్టీ రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. టీడీపీ పార్లమెంట్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎస్కే ఫయాజ్, నాయకులు ఇల్లందుల రమేశ్ వర్దినేని లింగారావు, శివ, బత్తిని సంజీవ్, ఆడెపు రవీందర్, రమేశ్, గరిగె స్వామి, ఎండీ ఆఫ్రీన్ ఉన్నారు.

దారి వివాదంపై పోలీసుల కౌన్సెలింగ్

జమ్మికుంట: పట్టణంలోని దుర్గాకాలనీలో దారి వివాదంపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు..దుర్గాకాలనీలో గడ్డం పెద్దులు ఇంటి నిర్మాణం చేపట్టాడు. దారి ఆక్రమించి ఇల్లు కడుతున్నాడని మున్సిపల్ అధికారులు, కలెక్టర్‌కు అదే కాలనీకి చెందిన ఓ టీచర్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా సమాచారం అందుకున్న టౌన్ సీఐ వరంగంటి రవి వెంటనే పెద్దులును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి వివాదంపై వివరాలు తెలుసుకొని కౌన్సెలింగ్ ఇచ్చామని సీఐ వివరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని ధాన్యం లారీ ఢీకొట్టింది. ధాన్యం లోడ్‌తో వెళ్తుండగా రోడ్డు ఇరుకుగా ఉండడంతో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనడంతో ధాన్యం బస్తాలు చిరిగిపోడంతో ధాన్యం రోడ్డుపై పడిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

ప్రమాదంలో తెగిన చేయి

రామడుగు: మండలంలోని గుండి గ్రామానికి చెందిన ద్యాగ మల్లేశం కుడి చేయి గడ్డికట్టలు కట్టే మెషిన్‌లో చిక్కుకొని తెగిపోయింది. కట్టలు కట్టే మెషిన్‌లో దారం పెట్టడానికి ప్రయత్నిస్తుండగా జరిగిన ప్రమాదంలో మోచేతి వరకు తెగిపోయింది. బాధితున్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు.

బియ్యం అందజేత

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన యువకుడు తాండ్ర శ్రీహాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నర్సింగాపూర్‌కు చెందిన అతిథి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేశ్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రెండు క్వింటాళ్ల బియ్యం అందించారు. వెంట నల్ల కొండాల్‌రెడ్డి, సునీల్, వెంట వెంకటేశ్, లక్ష్మీనారాయణ, రాకేశ్‌రెడ్డి, సతీశ్‌కుమార్, విద్యాసాగర్, గట్టయ్య,మోహన్‌రెడ్డి ఉన్నారు. మల్లారెడ్డిపల్లి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాభై కిలోల బియ్యం అందజేశారు. శనివారం రాత్రి సంతాప సభ నిర్వహించనున్నట్లు కళాకారులు గర్జన, బాబ్జీ, ఎల్లమ్మ ఫేమ్ అశోక్‌తో పలువురు కళాకారులు, గాయకులు హాజరవుతారని వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మయ్య తెలిపారు.


నవీన్, అరుణ్‌సాయినిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి


ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఉద్యోగులకు సన్మానం

గన్నేరువరం: గ్రూప్-4లో ఉద్యోగాలు సాధించిన గర్షకుర్తి నవీన్, అరుణ్‌సాయిని రైతు హక్కుల పోరాట సాధన సమితి మండల అధ్యక్షుడు పుల్లెల రాము శుక్రవారం మండల కేంద్రంలో అభినందించి సన్మానించారు. వీరితో పాటు కొట్టె సాయికృష్ణ ప్రతిభ చాటాడు. ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి గ్రామానికి, యువతకు ఆదర్శంగా నిలిచారని, తల్లిదండ్రులు, విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు, గ్రామస్తులకు గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. గర్షకుర్తి నవీన్, అరుణ్‌సాయిని యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మండలకేంద్రంలో శాలువాతో సన్మానించారు. మున్సిపల్‌శాఖలో ఉద్యోగాలను సాధించడం పట్ల అభినందనీయమని, మండలం, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు..

శంకరపట్నం: హుజూరాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన తనుకు ప్రభాకర్‌ను కేశవపట్నంలో అంబేద్కర్ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంతడ్పుల సతీశ్, బొజ్జ రవి, మాజీ సర్పంచులు భద్రయ్య, కొండ్ర రాజయ్య, నాయకులు సుధాకర్, కుమార్, సమ్మయ్యలున్నారు.

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి, నాయకులు


హుజూరాబాద్: జిల్లా కేంద్రంలోని ఏచూరినగర్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయటంలో విఫలమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తుందని, కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్, సైదాపూర్ సీపీఎం మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, నాయకులు కదిరి రమేశ్, వద్ద రాజు, ఎండీ హుస్సేన్ ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ బీసీకివ్వడం సరికాదు


మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్ కమిటీ నియామకంలో ఎస్సీ మహిళా రిజర్వేషన్ బీసీ మహిళకు ఇవ్వడం సరికాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలో టౌన్ అధ్యక్షుడు బిట్ల మోహన్ అధ్యక్షతన నిర్వహించిన మాలమహానాడు ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గానికి చెందినవారు ఎందరో ఉన్నారని, కులాంతర వివాహం చేసుకున్న బీసీ మహిళకు ఇవ్వడం బాధాకరమన్నారు. చదువుకున్న అడ్మిషన్ రిజిస్ట్రార్‌లో బీసీ వడ్రంగి ఉందని, ఇప్పటికైనా దళిత మహిళకు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు, నిరసనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పెండెం పెంచలయ్య, బోగం నర్సయ్య, పోతుల దిలీప్, శీలం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హుజూరాబాద్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో శుక్రవారంఅగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో వరికొయ్యళ్లను కాల్చేందుకు నిప్పు పెట్టగా ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు పక్కనే నిల్వ ఉన్న గడ్డివాముపై పడ్డాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేసినా గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని రైతు బోరుమని విలపించాడు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

జమ్మికుంట: మండలంలోని విలాసాగర్‌లో బీజేపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ చెన్నమాధవని నరసింహ రాజు, జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలన్నారు. దళిత మోర్చా మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు ఐలయ్య, భద్రయ్య, శ్రీనివాస్, చిన్నయ్య, ఓదెలు, రామస్వామి,ఐలయ్య, సమ్మయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి, బేతిగల్, వీణవంక గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సురేశ్ తెలిపారు. బేతిగల్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4.30, పోతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 01.30 గంటల వరకు, వీణవంక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు అంతరాయం కలుగుతుందని ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ

హుజూరాబాద్: పట్టణంలోని విద్యానగర్‌లో యూత్ ఫోర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థ వారి గ్రాస్ రూట్ అకాడమీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి శిక్షణ నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ ఆర్. తిరుపతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి కల్పించే వివిధ విభాగాలకు శిక్షణ ఉంటుందని, వివరాలకు 6301492276 నంబర్ సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకుంట లేదు

వీణవంక: రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీజేపీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కుల సంపత్‌రావు అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుల ఖాతాలల్ల వేస్తామని చెప్పి ఇంతవరకు వేయకపోవడం దారుణమని, యాసంగి సీజన్ ప్రారంభమైందని రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పు తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని, రానున్న రోజుల్లో రెండు పార్టీలు తెలంగాణలో కనుమరుగవడం ఖాయమన్నారు.

చొప్పదండి ప్రీమియర్ లీగ్

రామడుగు: రామడుగు గడికోట క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన చొప్పదండి నియోజకవర్గ ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో రామడుగు ముంజాల ప్రవీణ్ జట్టు గంగాధర శ్రీహరి జట్టుపై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శ్రీహరి జట్టుకు చెందిన గంట వివేక్, బెస్ట్ బౌలర్‌గా భాస్కర్ నిలిచారు. ముగింపు కార్యక్రమంలో స్పాన్సర్ ముంజాల ప్రవీణ్‌గౌడ్, ముఖ్య అతిథిగా కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా మహిళా ప్రెసిడెంట్ కర్ర సత్యప్రసన్నారెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపీపీ పూరెల్ల గోపాల్‌గౌడ్, నాయకులు తదితరులు హాజరయ్యారు.

'ఆరోపణలు అవాస్తవం'


మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకంలో ఎస్సీ మాదిగా కాదనే మాలల ఆరోపణలు అవాస్తవమని పుల్లూరి స్వప్న మాదిగ బిడ్డే ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రం మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. మాల మహానాడు చేసిన ప్రకటనను మాదిగ రజర్వేషన్ పోరాట సమితి ఖండిస్తుందని, మాదిగ బిడ్డపై కుట్రలు చేస్తే సహించమని, స్వప్న గతంలో ఎంపీటీసీగా ఎస్సీ రిజర్వేషన్‌లో గెలుపొందారని, హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసిందన్నారు. మాలలు కుట్రలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సాయిబాబా సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్తలు

సాయిబాబా సంస్మరణ సభ

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సాయిబాబా సంస్మరణ సభ ప్రజాసంఘాల జేఏసీ నాయకుడు ఆవునూరు సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. సభకు వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబాకు అన్యాయంగా పదేళ్లు కఠిన శిక్ష విధించడంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని చనిపోయారని, మృతికి కేంద్ర ప్రభుత్వమే కారణమని అన్నారు. సాయిబాబా ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తెలంగాణ జన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముక్కెర రాజు, ప్రజా సంఘాల నాయకులు పాడిశెట్టి వెంకటరాజాం, వేల్పుల రత్నం, జయన్న ఫౌండేషన్ నాయకులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే


గన్నేరువరంలో వివరాలను నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్

గన్నేరువరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో కొనసాగుతోంది. కార్తీకమాసం శుక్రవారం రోజు సర్వేను నిర్వహించారు. 6 నుంచి 8వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి స్టికర్లు వేశారు. 9వ తేదీ నుంచి సర్వేలో నిమగ్నమయ్యారు. సర్వే తీరును సూపర్‌వైజర్లు తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో కిరణ్మయి, ఎంఈవో రామయ్య, ఏపీఎం లావణ్య ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ పరిశీలిస్తున్నారు.